# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శుక్రవారం-10-ఏప్రిల్-2026 | సంపుటి : 3 | సంచిక : 312 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# 27 నెలలు క్షోభ అనుభవించాను

## త్వరలో బీఆర్ఎస్‌లో చేరుతా.. మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**జగిత్యాల, ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):**

తాను భారత రాష్ట్ర సమితిలో చేరాలని నిర్ణయించుకున్నట్లు మాజీ మంత్రి జీవన్ రెడ్డి వెల్లడించారు. జగిత్యాలలో ఆయన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తన రాజకీయ నిర్ణయాన్ని స్పష్టం చేశారు.తన శేష జీవితంలో కేసీఆర్ తో కలిసి పనిచేసే అవకాశం రావడం సంతోషకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తే రాష్ట్ర భవిష్యత్తుకు మరింత సమర్థంగా సేవలందించవచ్చని అభిప్రాయపడ్డారు. గత 27 నెలలుగా తీవ్ర క్షోభను అనుభవించినట్లు వెల్లడించారు.

కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సమయంలో భావోద్వేగానికి లోనయ్యానని, బీఆర్ఎస్ కంటే మెరుగైన పాలన అందుతుందని నమ్మి కాంగ్రెస్‌కు మద్దతు తెలిపినట్లు తెలిపారు. అయితే, రెండేళ్ల పాలనలో రాష్ట్రం తిరోగమన దిశలో నడుస్తోందని విమర్శించారు. 2014లోనే కేసీఆర్ నాయకత్వంలో పనిచేసే అవకాశం వచ్చినప్పటికీ, అప్పట్లో కాంగ్రెస్‌లోనే కొనసాగానని చెప్పారు.

మిగతా 2లో..



# ఆదిలాబాద్ విమానాశ్రయానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

- నిర్మాణానికి కీలక నిర్ణయాలు
- డిఫెన్స్ ఎయిర్ స్ట్రిప్ వినియోగానికి అంగీకారం
- 360 ఎకరాల్లో విమానాశ్రయం.. అదనంగా భూసేకరణ అవసరం
- ఏప్రిల్ 17న ఓఎల్ఎస్ సర్వే నిర్వహణ

**ఆదిలాబాద్, ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఢిల్లీలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రామ్ మోహన్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ ప్రాజెక్టుకు సూత్రప్రాయ ఆమోదం లభించింది. తెలంగాణలో హైదరాబాద్ తర్వాత ఇతర ప్రాంతాల్లో కూడా విమానాశ్రయాల అభివృద్ధి అవసరాన్ని గుర్తించిన కేంద్రం, ఆదిలాబాద్‌లో ఇప్పటికే ఉన్న డిఫెన్స్ ఎయిర్ స్ట్రిప్‌ను వినియోగించి కొత్త విమానాశ్రయం నిర్మించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చలు జరిపి పూర్తి సహకారం పొందినట్లు కేంద్ర మంత్రులు వెల్లడించారు.

మిగతా 2లో..



# ప్రతి బిడ్డకు విద్యా సౌకర్యాలు కల్పిస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- బోనకల్లులో విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ
- జూన్ 2 నుంచి అల్పాహార పథకం అమలు
- ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ ప్రమాణాల విద్య లక్ష్యం

2లో

# ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న వ్యాఖ్యలు సరికావు

## రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్,ఏప్రిల్09(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి వ్యాఖ్యలు వాస్తవానికి విరుద్ధమని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. బీఆర్ఎస్‌లో చేరుతానని ప్రకటిస్తూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అడ్లూరి లక్ష్మణ్ స్పందించారు. జీవన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను ఓడించడమే తన ధ్యేయమని చెప్పడం సమంజసం కాదని అన్నారు. ఎన్నికల్లో ఓటమి చెందిన వెంటనే రేవంత్ రెడ్డి ఆయనతో ఫోన్‌లో మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఓడినా మంత్రి పదవి ఇవ్వాలని కూడా సూచించినట్లు తెలిపారు.

అయితే, ఓడిన అభ్యర్థులకు మంత్రి పదవి ఇవ్వకూడదన్న ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ నిబంధనల కారణంగానే ఆ నిర్ణయం అమలుకాలేదని వివరించారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అనేకసార్లు అవకాశం కల్పించిందని, మొత్తం 14 సార్లు బీఫామ్ ఇచ్చిందని పేర్కొన్నారు.





# తెలంగాణ జాగృతిలోకి 50 మంది చేరిక

- మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సభ్యుల చేరిక
- డా. మంచాల వరలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం
- కండువా కప్పి ఆహ్వానించిన కవిత

**హైదరాబాద్, ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ జాగృతి ఉపాధ్యక్షురాలు డా. మంచాల వరలక్ష్మి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన డి. సౌజన్య, డి. శరత్ రెడ్డి తదితరులతో కూడిన 50 మంది సభ్యుల బృందం తెలంగాణ జాగృతిలో చేరింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్తగా చేరిన సభ్యులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జాగృతి కార్యకలాపాలను విస్తరించడంలో కొత్త సభ్యుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక విలువలను పరిరక్షించడం, మహిళల సాధికారతకు కృషి చేయడం జాగృతి ప్రధాన లక్ష్యమని తెలిపారు. కొత్తగా చేరిన సభ్యులు సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.

మిగతా 2లో..

# 2బిహెచ్‌కే పట్టాల పంపిణీ..

# పేదలకు ఇల్లు అందించడం ప్రభుత్వ లక్ష్యం



**మంత్రి పొన్నం ప్రభాకర్**

- బహదూర్‌పుర, కార్వాన్ నియోజకవర్గాల్లో పంపిణీ
- 251 కుటుంబాలకు ఇళ్ల హక్కుల పత్రాలు అందజేత
- గృహ భద్రతతో జీవనోపాధికి బలం

**హైదరాబాద్, ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):**

పేదలకు సొంత ఇల్లు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ నగరంలోని కార్వాన్ ఎంకే కన్వెన్షన్ హాల్‌లో బహదూర్‌పుర, కార్వాన్ నియోజకవర్గాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు 2బిహెచ్‌కే పట్టాలను పంపిణీ చేశారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ప్రతి బిడ్డకు విద్యా సౌకర్యాలు కల్పిస్తాం



**ఖమ్మం, ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో పుట్టిన ప్రతి బిడ్డకు చదువుకోవడానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని బోనకల్లు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు.

అక్షరమే అసలైన ఆయుధమని, విద్య ద్వారానే సమానత్వంతో కూడిన ఆదర్శ సమాజం సాధ్యమవుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. తెలంగాణ బిడ్డలు విద్యను ఆయుధంగా మలుచుకుని ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఏ బిడ్డ కూడా ఆకలితో బడికి వెళ్లకూడదనే లక్ష్యంతో జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు అల్పాహార పథకం ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు తెలిపారు. విద్యపై ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతోందని, ఆ పెట్టుబడులు వృథా కాకుండా విద్యార్థులను ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దాలని అన్నారు. రాష్ట్రంలో పుట్టిన ప్రతి బిడ్డ తన సామర్థ్యానికి అనుగుణంగా చదువుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలను భారీ స్థాయిలో నిర్మిస్తూ, డిజిటల్ విద్య, క్రీడా సదుపాయాలు, హాస్టల్ సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసి ఉచితంగా నాణ్యమైన విద్య అందించనున్నట్లు వెల్లడించారు.

ప్రైవేటు పాఠశాలలపై ఆధారపడకుండా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉచితంగా మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.

# 2బిహెచ్‌కే పట్టాల పంపిణీ..

## పేదలకు ఇల్లు అందించడం ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బహదూర్‌పుర నియోజకవర్గం పరిధిలోని ఫరూక్‌నగర్ ప్రాంతంలో 76 మంది లబ్ధిదారులకు, కార్వాన్ నియోజకవర్గంలోని జియగూడ ప్రాంతంలో 175 మంది లబ్ధిదారులకు ఇళ్ల హక్కుల పత్రాలు అందజేసినట్లు తెలిపారు. మొత్తంగా 251 కుటుంబాలకు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం చేకూరిందన్నారు.

పేద, నిరుపేద కుటుంబాలు సొంత ఇల్లు కలిగి ఉండేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. గృహ వసతి సమస్యలను పూర్తిగా పరిష్కరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంలో గృహ వసతి కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. సొంత ఇల్లు కలిగి ఉండటం ద్వారా కుటుంబాలకు భద్రతతో పాటు ఆర్థిక స్థిరత్వం కూడా పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు కౌసర్ మొహినుద్దీన్, మహమ్మద్ ముబిన్, ఆర్డీవో, ఎమ్మార్వో, హౌసింగ్ పీడీ తదితర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేశారు. లబ్ధిదారులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి పథకాలు మరింత మందికి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గృహ భద్రతతో ప్రజల జీవన స్థాయి మరింత మెరుగుపడుతుందని మంత్రి తెలిపారు.

# 27 నెలలు క్షోభ అనుభవించాను

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం రాష్ట్ర అవసరాల దృష్ట్యా బీఆర్ఎస్‌తో కలిసి ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, కేసీఆర్ మరియు జీవన్ రెడ్డి మధ్య నాలుగు దశాబ్దాలకు పైగా స్నేహబంధం ఉందని గుర్తు చేశారు. గతంలోనూ ఆయనను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించినప్పటికీ, కాంగ్రెస్ అనుబంధం కారణంగా ఆ నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ఇప్పుడు మరోసారి ఆహ్వానించగా సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. రెండ్రోజుల్లో జీవన్ రెడ్డి కేసీఆర్‌ను కలిసే అవకాశం ఉందని చెప్పారు.

రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రైతులకు ప్రకటించిన రైతు భరోసా నిధులు అందకపోవడంతో తీవ్ర నిరాశ నెలకొందని అన్నారు. హామీల అమలులో వైఫల్యం, అనవసర వ్యాఖ్యలు ప్రజల్లో విసుగుకు దారి తీస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి భాషపై కూడా జనాల్లో చర్చ జరుగుతోందని తెలిపారు.

# సికింద్రాబాద్‌లో యువ అధికారులకు సాంకేతిక శిక్షణ..

- **ఆధునిక యుద్ధ విధానాలపై అవగాహన**
- **ఎంసీఈఎంఈలో శిక్షణ కార్యక్రమం**
- **డ్రోన్స్, రోబోటిక్స్, ఏఐపై ప్రత్యక్ష అవగాహన**
- **లోజిస్టిక్స్, సరఫరా వ్యవస్థలపై దృష్టి**



**సికింద్రాబాద్, ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న 30 మంది యువ అధికారులు సికింద్రాబాద్‌లోని ఎంసీఈఎంఈను సందర్శించారు. ఈ సందర్భంగా ఆధునిక సాంకేతికతలపై వారికి ప్రత్యేక అవగాహన కల్పించారు.

శిక్షణలో భాగంగా డ్రోన్స్, రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు, అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి ఆధునిక అంశాలపై అధికారులు వివరించారు. సైనిక శిక్షణలో ఉపయోగించే అత్యాధునిక ల్యాబ్‌లను పరిచయం చేస్తూ, కొత్త విధానాలను వివరించారు.

అదేవిధంగా ఆయుధ వ్యవస్థలు, విమాన వనరులు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ పరికరాలు, కమ్యూనికేషన్ టెక్నాలజీల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఆధునిక యుద్ధాల్లో సాంకేతికత ప్రాధాన్యం ఎంత పెరిగిందో వివరించారు.

లోజిస్టిక్స్ వ్యవస్థలు, సరఫరా గొలుసు నిర్వహణ, నిల్వ నిర్వహణ వంటి అంశాలపై కూడా శిక్షణ అందించారు. సమర్థవంతమైన సరఫరా విధానాలు సైనిక కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

ఈ శిక్షణ ద్వారా యువ అధికారులకు భవిష్యత్తులో విధులు నిర్వహించేందుకు అవసరమైన నైపుణ్యాలు పెరుగుతాయని అధికారులు తెలిపారు. ఆధునిక యుద్ధ విధానాలకు అనుగుణంగా పనిచేయడానికి ఈ అనుభవం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపు ద్వారా సైనిక దళాల సామర్థ్యం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

# గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు

- **భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు: ప్రధాన కార్యదర్శి**
- **ఎనిమిది జిల్లాల్లో విస్తృత ఏర్పాట్లకు ఆదేశాలు**
- **కేబినెట్ ఉపసమితికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**
- **ఇంజినీరింగ్ బృందాలతో పనుల ఖరారు**



**హైదరాబాద్, ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** రాబోయే గోదావరి పుష్కరాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పుష్కరాల ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు.

గోదావరి నది కందకుర్తి నుంచి భద్రాచలం వరకు బాసర మార్గంగా ఎనిమిది జిల్లాల్లో ప్రవహిస్తుందని పేర్కొంటూ ఈ ప్రాంతాల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. అందుకు అనుగుణంగా అన్ని జిల్లాల్లో విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పుష్కరాల ఏర్పాట్లపై మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. ఆ సూచనల మేరకు సంబంధిత శాఖలు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి కేబినెట్ ఉపసమితికి సమర్పించాలని ఆదేశించారు.

పుష్కరాల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే నియమించిన ఇంజినీరింగ్ చీఫ్‌లు, చీఫ్ ఇంజినీర్ల కమిటీ ప్రతిపాదిత పనులను పరిశీలించి తుది నిర్ణయం తీసుకోవాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. మౌలిక వసతుల అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

పుష్కరాల సందర్భంగా తాగునీరు, శానిటేషన్, రవాణా, భద్రత వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమన్వయంతో పని చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో శైలజా రామయ్యర్, హనుమంతరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు.

# సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణపై సమీక్ష



- **పీఎన్‌జీ వినియోగం పెంపుపై దృష్టి**
- **ఎల్‌పీజీకి ప్రత్యామ్నాయంగా పీఎన్‌జీ ప్రోత్సాహం**
- **రామగుండం–కరీంనగర్ పైప్‌లైన్ పనుల పురోగతి**
- **వాణిజ్య రంగంలో వినియోగం పెంపుపై అవగాహన**

**జగిత్యాల, ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పీఎన్‌జీ వినియోగాన్ని పెంచే దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో పీఎన్‌జీ ఉత్తమ ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. స్వదేశీ వనరుల ద్వారా లభించే పీఎన్‌జీ వినియోగాన్ని విస్తరించడం అవసరమని తెలిపారు. ముఖ్యంగా వాణిజ్య విభాగాల్లో దీని వినియోగాన్ని పెంచాలని సూచించారు.

ప్రస్తుతం మొదటి దశలో భాగంగా రామగుండం నుంచి కరీంనగర్ వరకు గ్యాస్ పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయని ఐఓసిఎల్ ప్రతినిధులు వివరించారు. ఈ పనులు 2027 మార్చి నాటికి పూర్తవుతాయని తెలిపారు. జగిత్యాల జిల్లాను రెండవ దశలో కవరింగ్ చేయనున్నట్లు వెల్లడించారు. గ్యాస్ పైప్‌లైన్ పనుల అమలులో ఆర్ అండ్ బి, జాతీయ రహదారుల సంస్థ, మున్సిపల్ అధికారులతో పూర్తి సమన్వయం ఉంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా అనుమతులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. పనులు వేగవంతంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పీఎన్‌జీ కనెక్షన్ల ప్రయోజనాలు, భద్రత, ఖర్చు ఆదా వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కమిటీ నిర్ణయించింది. ముఖ్యంగా వాణిజ్య వినియోగదారులకు దరఖాస్తు విధానం వివరించి ప్రోత్సహించాలని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్, జిల్లా పౌర సరఫరాల అధికారి మరియు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జిల్లాలో పీఎన్‌జీ వినియోగం పెంపుతో పర్యావరణ పరిరక్షణతో పాటు ఇంధన భద్రతను సాధించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

# తెలంగాణ జాగృతిలోకి 50 మంది చేరిక

(మొదటి పేజీ తరువాయి)

డా. మంచాల వరలక్ష్మి మాట్లాడుతూ జాగృతి కార్యక్రమాలపై ఆకర్షితులై మరింత మంది సభ్యులు చేరుతున్నారని తెలిపారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో జాగృతి కీలకంగా పని చేస్తోందని పేర్కొన్నారు.

కొత్త సభ్యులు కూడా జాగృతి కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటామని తెలిపారు. సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సభ్యుల చేరికతో సంస్థ మరింత బలోపేతం అవుతుందని నాయకులు తెలిపారు.

# ఆదిలాబాద్ విమానాశ్రయానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్ట్ ప్రకారం 360 ఎకరాల డిఫెన్స్ భూమిలో విమానాశ్రయం నిర్మించనున్నారు. అదనంగా సుమారు 450 ఎకరాల భూసేకరణ అవసరమవుతుందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. డిఫెన్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణం జరుగుతుండగా, సివిల్ టెర్మినల్‌ను ఎయిర్‌పోర్ట్ అథారిటీ అభివృద్ధి చేయనుంది. ఏప్రిల్ 17న ఓఎల్ఎస్ సర్వే నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సర్వే అనంతరం రన్‌వే దిశ, మాస్టర్ ప్లాన్‌పై తుది నిర్ణయం తీసుకోనున్నారు. కేంద్ర, రాష్ట్ర, డిఫెన్స్, సివిల్ ఏవియేషన్ శాఖలు సమన్వయంతో పనులు వేగవంతం చేయనున్నాయి.

అవసరమైన భూసేకరణ పూర్తయిన వెంటనే భూమిపూజ నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రాంతీయ కనెక్టివిటీ మెరుగుపడటంతో పాటు అభివృద్ధికి ఊతమివ్వనుంది.

ఆదిలాబాద్ భౌగోళికంగా కీలక ప్రాంతంగా ఉండటంతో పర్యాటకం, పారిశ్రామిక అభివృద్ధి, వాణిజ్య కార్యకలాపాలకు ఇది ప్రధాన కేంద్రంగా మారే అవకాశముందని కేంద్ర మంత్రులు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ జిల్లాకు మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# గిరిజన ఆశ్రమ పాఠశాలలో నీటి ఎద్దడి

- బోరు పనిచేయక విద్యార్థినుల ఇబ్బందులు

**సత్తుపల్లి, ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):**

కల్లూరు మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో తీవ్ర నీటి సమస్య నెలకొంది. పాఠశాలలోని మోటారు బోరు గత మూడు నెలలుగా పనిచేయకపోవడంతో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న సుమారు 85 మంది విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఒకే ఒక్క హ్యాండ్‌పంపుపైనే ఆధారపడాల్సి వస్తోందని, చిన్నారులు నీటిని తోడుకోవడంలో తీవ్ర శ్రమకు గురవుతున్నారని పాఠశాల వర్గాలు తెలిపాయి. స్నానాలు, మరుగుదొడ్ల అవసరాలకు తగినంత నీరు లేక విద్యార్థినులు అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రధానోపాధ్యాయుడు లకావత్ శ్రీనివాసులు సహా సిబ్బంది గురువారం మున్సిపల్ చైర్మన్ దారవత్ మోహన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంపై స్పందించిన చైర్మన్, వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణమే బోరు మరమ్మతులు చేయించడం లేదా కొత్త బోరు త్రవ్వించి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.



# వెంకట్ రెడ్డి నగర్‌లో ఇందిరమ్మ ఇండ్ల అర్హుల వెరిఫికేషన్

- ఆకారపు అరుణ్ పటేల్ పర్యవేక్షణలో క్షేత్రస్థాయి తనిఖీలు
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

**ఉప్పల్, ఏప్రిల్ 9 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు ప్రక్రియ వేగవంతమైంది. సొంత స్థలం కలిగి ఇల్లు నిర్మించుకోవాలనుకునే అర్హులకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించే ఈ పథకానికి దరఖాస్తు చేసిన వారి వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.ఈ సందర్భంగా ఆకారపు అరుణ్ పటేల్ సంబంధిత అధికారులతో కలిసి వెంకట్ రెడ్డి నగర్, రామ్ రెడ్డి నగర్, వాసవి నగర్ ప్రాంతాల్లో పర్యటించి దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి భూ పత్రాలు, అర్హతలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ, "రేవంత్ అన్న ప్రభుత్వంలో పరమేశ్వర్ రెడ్డి సహకారంతో నిజమైన పేదలకు ఈ పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా వెరిఫికేషన్ కొనసాగుతోంది" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ అంజనేయులు, అధికారి హనుమాన్, టెంపుల్ డైరెక్టర్ రాఘవేంద్ర, రాజేష్, చోట, మిట్టు పద్మ, మాధవి, సాయి తదితరులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.



# సీసీ రోడ్ల పనులు పరిశీలించిన స్వర్ణరాజ్ శివమణి

**కాప్రా, ఏప్రిల్ 9 ( తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ డివిజన్ పరిధిలోని గోపాల్ రెడ్డి నగర్‌లో రూ.27.50 లక్షల నిధులతో కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోపాల్ రెడ్డి నగర్ కాలనీ వాసులకు అంతర్గత సీసీ రోడ్లు నిర్మిస్తానని కార్పొరేటర్‌గా ఇచ్చిన హామీని అమలు చేస్తున్నానన్నారు. తాను మంజూరు చేయించిన రూ.27.50 లక్షల నిధులతో పనులు జరుగుతున్నాయని తెలిపారు.మిగిలిన రోడ్ల నిర్మాణం కోసం మరో రూ.20 లక్షల నిధులతో టెండరింగ్ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలో టెండర్ పూర్తి చేసి మిగిలిన అంతర్గత రోడ్ల పనులు కూడా ప్రారంభిస్తామని చెప్పారు.కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు స్వర్ణరాజ్ శివమణిని గోపాల్ రెడ్డి నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొబ్బనూరి నాగ శేషు, నాయకులు పి. పవన్ కుమార్, పడమటి మల్లారెడ్డి, తన్నీరు శ్రీహరి, రిజ్వాన్ ఖాన్, బి. మనోజ్ కుమార్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహణ

- ప్రభుత్వ పథకాలతో వికలాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని
- చైర్మన్ హామీ

**కాప్రా, ఏప్రిల్ 9 (తెలంగాణ ముచ్చట్లు):**





తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముతినేని వీరయ్య ఆధ్వర్యంలో కాప్రా మున్సిపాలిటీ కార్యాలయంలో వికలాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా వికలాంగుల సంక్షేమం కోసం చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సుమారు 96 మంది వికలాంగులు తమ సమస్యలను వినిపిస్తూ దరఖాస్తులు సమర్పించారు. చైర్మన్ ముతినేని వీరయ్య ప్రతి ఒక్కరి సమస్యను శ్రద్ధగా విని, అర్హులైన వారి దరఖాస్తులను సంబంధిత అధికారులకు తక్షణమే ఫార్వార్డ్ చేశారు.వికలాంగులు ప్రధానంగా డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, పెన్షన్లు, వైద్య సహాయం మరియు మౌలిక సదుపాయాలపై తమ వినతులను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలను వెల్లడిస్తూ, ఇళ్ల స్థలాల కేటాయింపులో 5 శాతం, ప్రభుత్వ ఉద్యోగాలలో 4 శాతం, ఉన్నత విద్యలో 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇద్దరు వికలాంగుల వివాహానికి కళ్యాణ లక్ష్మితో పాటు అదనంగా రూ.2 లక్షల ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు చెప్పారు.వికలాంగ క్రీడాకారుల కోసం ప్రత్యేక పారా స్పోర్ట్స్ పాలసీ అమలులో ఉందని, 40 శాతం పైగా వైకల్యం ఉన్న వారికి అవసరమైన సహాయక ఉపకరణాలు అందిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమం లో జిల్లా సంక్షేమ అధికారి, డిప్యూటీ కమిషనర్, కాప్రా పోస్ట్ ఆఫీస్, సిడిపిఓ, అల్వాల్ బిఆర్‌ఓబి కోఆర్డినేటర్, సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు, ఎన్.పి.ఆర్.డి రాష్ట్ర అధ్యక్షులు కె. వెంకట్, టీవీహెచ్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుత్తికొండ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.వికలాంగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారిని ఆర్థికంగా మరియు సామాజికంగా బలోపేతం చేయడానికి అన్ని విధాలుగా సహాయం అందిస్తామని చైర్మన్ ముతినేని వీరయ్య హామీ ఇచ్చారు.

# జంగమాయపల్లి పంచాయతీ విభజనలో అన్యాయం

- గ్రామస్తుల ఆరోపణ

**పెద్దమందడి,ఏప్రిల్9(తెలంగాణ ముచ్చట్లు):**




వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని జంగమాయపల్లి గ్రామపంచాయతీ విభజనలో తీవ్ర అన్యాయం జరిగిందని గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ మేడమోని జ్యోతి నేతృత్వంలో గ్రామ పెద్దలు, ప్రజలు కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.గ్రామస్తుల వివరాల ప్రకారం, గతంలో జంగమాయపల్లి, బలిజపల్లి గ్రామాలు కలిపి ఒకే గ్రామ పంచాయతీగా ఉండగా, 2018లో వాటిని విడివిడిగా ఏర్పాటు చేశారు.అయితే ఈ ప్రక్రియలో రెవెన్యూ సరిహద్దులు, శివారు హద్దులు శాస్త్రీయంగా నిర్ణయించకుండా, గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా, ప్రజల ఆమోదం పొందకుండా అశాస్త్రీయంగా విభజన జరిగిందని వారు పేర్కొన్నారు. అదేవిధంగా, 2018లో జంగమాయపల్లి జనాభాను తక్కువగా చూపించి, గ్రామానికి చెందిన కొన్ని ఇండ్లను బలిజపల్లిలో చేర్చినట్లు ఆరోపించారు. ఈ కారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి జనాభా ప్రాతిపదికన వచ్చే నిధుల కేటాయింపులో జంగమాయపల్లికి తీవ్ర నష్టం జరుగుతోందని తెలిపారు.గ్రామపంచాయతీ ఆదాయం కూడా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం జరగనున్న 2027 జనగణన నేపథ్యంలో, ముందుగా గ్రామ సరిహద్దులు, శివారు హద్దులను శాస్త్రీయ పద్ధతిలో ఖరారు చేసి తర్వాతే జనగణన నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో కూడా నిధుల కేటాయింపులో అన్యాయం కొనసాగుతుందని హెచ్చరించారు.ఇక, గతంలో జంగమాయపల్లి పేరుతో ఉన్న ఎంపీటీసీ స్థానాన్ని 2018లో బలిజపల్లికి మార్చడం కూడా అన్యాయమని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. జనాభా, ఓటర్ల జాబితా, రెవెన్యూ శివారు ఆధారంగా పెద్ద గ్రామపంచాయతీ అయిన జంగమాయపల్లి పేరునే ఎంపీటీసీ కొనసాగించాలని వారు కోరారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని, జరిగిన లోపాలను సరిదిద్ది గ్రామానికి న్యాయం చేయాలని గ్రామస్తులు గట్టిగా విజ్ఞప్తి చేశారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ ప్రమాణ స్వీకారం

**కుషాయిగూడ, ఏప్రిల్ 9 (తెలంగాణ ముచ్చట్లు):**





ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభంగా కీలక పాత్ర పోషిస్తుందని, జర్నలిస్టుల సంక్షేమం కోసం తమ వంతు సహకారం అందిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని రాధిక చౌరస్తా వద్ద ఉన్న పరివార్ హోటల్‌లో కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. క్లబ్ అధ్యక్షుడు లయన్ వడ్లోజు జ్యోతిర్మయాచారి (వార్తా చారి) అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులు నిర్భయంగా నిజాలను వెలికితీసి సమాజానికి అందిస్తున్నారని, వారి సేవలు అభినందనీయమని తెలిపారు. జర్నలిస్టుల కోసం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఆరోగ్య బీమా, గృహ స్థలాల కేటాయింపు వంటి సంక్షేమ కార్యక్రమాలపై కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని చెప్పారు. ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న జర్నలిస్టులకు తమ మద్దతు కొనసాగుతుందని తెలిపారు.కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ నూతన అధ్యక్షుడు జ్యోతిర్మయాచారి మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు అధ్యక్షుడు వడ్లోజు జ్యోతిర్మయాచారి, ప్రధాన కార్యదర్శి ఆదిమూల శ్రీనివాస్, కోశాధికారి వట్టిపల్లి సురేష్, ఉపాధ్యక్షుడు లక్కడి బాలరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డమీద బాలరాజు గౌడ్, కార్యదర్శి గుమ్మడి రోజారాణి ప్రమాణ స్వీకారం చేశారు.టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ జర్నలిస్టులు సమాజంలోని అవకతవకలను వెలికితీయడంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త లయన్ మాణిక్ రెడ్డి 32 మంది జర్నలిస్టు కుటుంబాలకు కుట్టుమిషన్లు అందజేశారు.ఈ కార్యక్రమం లో పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, పోలీస్ అధికారులు, జర్నలిస్టులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎల్కతుర్తిలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం గంజాయి స్వాధీనం

**ఎల్కతుర్తి, ఏప్రిల్ 9( తెలంగాణ ముచ్చట్లు):**





హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో మాదకద్రవ్యాలపై పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గంజాయి సేవిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం, గురువారం ఉదయం సుమారు 11:15 గంటల సమయంలో ఎల్కతుర్తి ఎస్సై ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, శ్రీ సత్యసాయి ఫంక్షన్ హాల్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో అనుమానాస్పదంగా కూర్చున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించారు. వారి వద్ద నుంచి పొగ రావడంతో తనిఖీ చేయగా, వారు గంజాయి సేవిస్తున్నట్లు తేలింది.

అరెస్ట్ అయిన వారిని కరీంనగర్ జిల్లా రేకుర్తి గ్రామానికి చెందిన దుర్గం కృష్ణకుమార్, సిద్దిపేట జిల్లా లక్షెంపురం గ్రామానికి చెందిన భోనగిరి సాయికిరణ్‌గా గుర్తించారు. వారి వద్ద నుంచి సుమారు 80 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోగా, దాని విలువ సుమారు రూ.4,000గా అంచనా వేశారు. అదనంగా రెండు మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పులి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగంపై ఎలాంటి సహనం చూపబోమని స్పష్టం చేశారు. డ్రగ్స్ వాడకం యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదకర అలవాటు అని హెచ్చరించారు. సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని, ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కొనుగోలు కేంద్రాల లోపాలు రైతులకు భారంగా మారుతున్నాయి

- బిజెపి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్

**ఎల్కతుర్తి, ఏప్రిల్9 (తెలంగాణ ముచ్చట్లు):**




ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో మొక్కజొన్న రైతులు కొనుగోలు కేంద్రాల లోపాల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ.2400 చెల్లిస్తామని ప్రకటించినప్పటికీ, ఆ ప్రయోజనం రైతులకు అందడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు సరిపడా లేకపోవడం వల్ల రైతులు తమ పంటను అమ్ముకునే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు ఒకే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల భీమదేవరపల్లి రైతులు దూర ప్రయాణం చేసి అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని అన్నారు. మార్కెట్ యార్డ్‌కు మొక్కజొన్న తీసుకురావడంలో డంపింగ్, మళ్లీ నింపడం, కాంట వేయడం వంటి ప్రక్రియల వల్ల రైతులపై మరింత ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. గోనె సంచుల కొరత కారణంగా రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోందని, వారు క్వింటాకు కేవలం రూ.1700 మాత్రమే చెల్లిస్తున్నారని విమర్శించారు. రైతులకు అందని గోనె సంచులు దళారులకు అందుతున్నాయన్న అనుమానాలు వ్యక్తం చేస్తూ, కొనుగోలు కేంద్రాల సిబ్బంది దళారులతో కుమ్మక్కై రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితుల వల్ల 100 క్వింటాళ్ల మొక్కజొన్న పండించిన రైతు సుమారు రూ.70,000 వరకు నష్టపోతున్నాడని తెలిపారు.

తక్షణమే అధికారులు స్పందించి రైతుల పొలాల వద్దకే గోనె సంచులు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల భయంతో రైతులు నిద్రలేకుండా ఆందోళనలో ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు విషయంలో న్యాయంగా వ్యవహరించాలని, లేకపోతే రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరించారు.



# డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా న్యాయవాదుల ఆందోళన

- "హుజురాబాద్ భవిష్యత్తు ప్రమాదంలో" అంటూ గళమెత్తిన బార్ అసోసియేషన్



**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ పట్టణ చివరలో ఏర్పాటు చేయనున్న చెత్త ప్లాస్టిక్ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా గురువారం పట్టణ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆందోళనకు దిగారు. న్యాయస్థానం భవనం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి తమ వ్యతిరేకతను ఘాటుగా వ్యక్తం చేశారు.

"డంపింగ్ యార్డ్ వల్ల హుజురాబాద్ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది... డంపింగ్ యార్డ్ వద్దు" అంటూ న్యాయవాదులు గట్టిగా నినాదాలు చేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణంపై తీవ్ర ప్రభావం ఉంటుందని హెచ్చరిస్తూ అధికారులను తక్షణమే నిర్ణయం మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

ర్యాలీ అనంతరం జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరాహార దీక్షకు న్యాయవాదులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జూనియర్ అడ్వకేట్ కేశబోయిన అశోక్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై పోరాటం మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఆందోళనకు మద్దతు ప్రకటిస్తూ, డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



# హుజురాబాద్‌లో ప్లాస్టిక్‌పై కఠిన నిషేధం

- అతిక్రమిస్తే భారీ జరిమానాలు అంటూ హెచ్చరించిన చైర్‌పర్సన్

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):**

హుజురాబాద్ పట్టణంలో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వినియోగంపై పురపాలక చైర్‌పర్సన్ సుహాసిని కఠినంగా విరుచుకుపడుతూ ఘాటుగా హెచ్చరించారు. గురువారం వ్యాపారులు, ఫంక్షన్ హాల్ యజమానులతో జరిగిన సమావేశంలో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు పూర్తిగా నిషేధమని స్పష్టం చేస్తూ ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమన్నారు.

ఏప్రిల్ 26 నుంచి ఆకస్మిక తనిఖీలు ప్రారంభమవుతాయని ప్రకటిస్తూ, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గట్టిగా హెచ్చరించారు. రూ.5,000 నుంచి రూ.25,000 వరకు భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేస్తూ, పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని తెలిపారు. వ్యాపారులు వెంటనే మార్పు చేసుకోవాలని లేకపోతే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరికలు జారీ చేశారు.

# కాప్రా సర్కిల్‌లో కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆకస్మిక తనిఖీ

- పారిశుద్ధ్యం, డ్రైనేజీ పనులపై సమీక్ష
- నిర్లక్ష్యంపై చర్యల హెచ్చరిక

**కాప్రా, ఏప్రిల్ 9 (తెలంగాణ ముచ్చట్లు)**





మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కాప్రా సర్కిల్ పరిధిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, అర్బన్ బయోడైవర్సిటీ, ఎంటమాలజీ విభాగాలకు సంబంధించిన పనులను పరిశీలించారు.కుషాయిగూడ భజన మందిర్ వద్ద జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పనులను తనిఖీ చేసిన కమిషనర్, ఇంటింటి చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణపై సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో కూడా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మారుతి ఎంక్లేవ్ పార్క్‌ను సందర్శించి లైట్ల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాసవి శివనగర్‌లో గల గ్రీన్ వేస్ట్ డంప్‌ను పరిశీలించి, వెంటనే వ్యర్థాలను తొలగించాలని రామ్కీ అధికారులకు సూచించారు. భవాని నగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకుని, సీనియర్ సిటిజన్లకు ఐడి కార్డుల మంజూరు విషయాన్ని త్వరగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అదే ప్రాంతంలో దోమల నివారణ చర్యలను కూడా పర్యవేక్షించారు.కాప్రా చెరువు నుంచి చక్రిపురం వరకు జరుగుతున్న నాలా డిసిల్టింగ్ పనులను పరిశీలించిన ఆయన, కుషాయిగూడలో నిర్మాణంలో ఉన్న యానిమల్ కింగ్డమ్ థీమ్ పార్క్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అధికారులు తమ విధులను క్రమశిక్షణతో నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, ఏసీపీ కృష్ణమూర్తి, టిపిఎస్ తుల్జా సింగ్, డిఈ బాలకృష్ణ, ఏఈ స్రవంతి, సానిటేషన్ మరియు ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# కూకట్పల్లి ప్రభుత్వ కళాశాలకు రూ.8 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

- విద్యా రంగానికి ప్రాధాన్యత
- డా. పట్నం మహేందర్ రెడ్డి
- అంగన్వాడి టీచర్లకు సెల్‌ఫోన్ల పంపిణీ

**మేడ్చల్ మల్కాజ్గిరి, ఏప్రిల్ 9 (తెలంగాణ ముచ్చట్లు)**






మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కూకట్పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.8 కోట్ల అభివృద్ధి పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డా. పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా రూ.4.95 కోట్ల పీఎం ఉషా గ్రాంట్స్‌తో జీ+1 భవనాన్ని ప్రారంభించగా, రూ.2.84 కోట్ల డీఎంఎఫ్టీ నిధులతో జీ+2లో అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జీవీ (జువీ) పథకం కింద గురుకుల సంస్థ ద్వారా 86 మంది నిరుపేద విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేసి, ఏడాది పాటు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.అలాగే జిల్లాలోని అంగన్వాడి సెంటర్ల టీచర్లకు సెల్‌ఫోన్లను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జిల్లా కలెక్టర్ మను చౌదరి కలిసి అందజేశారు.ఈ సందర్భంగా డా. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే అనేక మంది ప్రముఖులు చదివారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకువస్తామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ, క్రమశిక్షణతో చదివితే విజయాలు సాధ్యమవుతాయని, ఏఐ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, కూకట్పల్లి డిగ్రీ, జూనియర్ కళాశాలలకు ప్రత్యేక స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కళాశాల అభివృద్ధికి తాము సహకరిస్తామని తెలిపారు.కళాశాల ప్రిన్సిపల్ చందన వివరాల ప్రకారం ప్రస్తుతం 1687 మంది డిగ్రీ, 1700 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు కళాశాలలో చదువుతున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు "అరైవ్-అలైవ్" కార్యక్రమం

- ఏప్రిల్ 13 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు
- సీఎస్ రామకృష్ణారావు

**హైదరాబాద్, ఏప్రిల్ 9 (తెలంగాణ ముచ్చట్లు):**






రాష్ట్రంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం "అరైవ్అలైవ్" కార్యక్రమాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గురువారం డా. బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత కోసం ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రమాదాల సంఖ్య తగ్గడం లేదని తెలిపారు. వాహనాల పెరుగుదల, అతివేగ డ్రైవింగ్ ప్రధాన కారణాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకుని రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాలను వెంటనే నిర్వహించి, వారాంతర "అరైవ్అలైవ్" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధుల సహకారంతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఏప్రిల్ 13 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమం నిర్వహించబడుతుందని, ప్రజల ప్రాణాలను రక్షించడం, సురక్షిత రహదారులను ఏర్పాటు చేయడం ప్రధాన లక్ష్యమని సీఎస్ పేర్కొన్నారు.రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా పాదచారులు, ద్విచక్ర వాహనదారులే బాధితులవుతున్నారని, అవగాహన కార్యక్రమాలు మరింత విస్తరించాలని సూచించారు. గత మూడు నెలల్లో రోడ్డు భద్రత చర్యల్లో పురోగతి సాధించామని తెలిపారు. ఏప్రిల్ 13న గ్రామ స్థాయి రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు,ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రమాణ స్వీకారం,ఏప్రిల్ 15న "చిల్డ్రన్ రోడ్ సేఫ్టీ డే",ఏప్రిల్ 16న ఉద్యోగులకు హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై ప్రచారం,ఏప్రిల్ 17న "గోల్డెన్ అవర్" శిక్షణ,ఏప్రిల్ 18న ట్రాఫిక్ ఉల్లంఘనదారులకు కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఈ సమావేశంలో ఉన్నతాధికారులు,జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి కూకట్పల్లి నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.






# అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీ

- కూకట్‌పల్లి డిగ్రీ కళాశాలలో ఘనంగా కార్యక్రమం
- పోషణ్ పక్వాడ పోస్టర్ ఆవిష్కరణ

**కూకట్పల్లి, ఏప్రిల్ 9 (తెలంగాణ ముచ్చట్లు)**

మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలోని కూకట్‌పల్లి డిగ్రీ కళాశాలలో అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ మరియు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్, జిల్లా సంక్షేమ శాఖాధికారి శారద ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లందరికీ మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. సేవలను ఆధునిక సాంకేతికతతో మరింత సమర్థవంతంగా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.అలాగే, ఏప్రిల్ 9 నుండి 23 వరకు నిర్వహించబడే "పోషణ్ పక్వాడ" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. పోషణ్ పక్వాడ ద్వారా తల్లి శిశు పోషణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ సీడీపీవో, సూపర్వైజర్లు, ఐసీడీఎస్ సిబ్బంది మరియు అంగన్వాడీ టీచర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# గుర్తుతెలియని వృద్ధుడి మృతి

- మల్కాజ్గిరి పోలీసుల దర్యాప్తు
- సాయిరాం టాకీస్ సమీపంలో అపస్మారక స్థితిలో లభ్యం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

**మల్కాజ్గిరి, ఏప్రిల్ 9 (తెలంగాణ ముచ్చట్లు)**

హైదరాబాద్ నగరంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం సాయంత్రం 6:30 గంటలకు ఉస్మానియా ఆసుపత్రి మార్చురి నుండి పోలీసులకు సమాచారం అందింది. పోలీసుల కథనం ప్రకారం, మార్చి 23, 2026 రాత్రి సాయిరాం టాకీస్ వైన్ షాప్ సమీపంలో సుమారు 60 సంవత్సరాల వయస్సు గల ఓ గుర్తుతెలియని పురుషుడు అపస్మారక స్థితిలో పడిఉండగా స్థానికులు గమనించారు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అవసరమైన సిటీ స్కాన్ తదితర వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో ఆ వ్యక్తిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ మార్చి 24, 2026న ఆ వ్యక్తి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని మార్చురిలో ఉంచగా, ఏప్రిల్ 9, 2026న అధికారికంగా ఈ విషయం వెల్లడైంది. ఈ ఘటనపై మల్కాజ్గిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఎస్ఐ జితేందర్ సింగ్ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.





# మీ సేవలే పట్టణానికి బలం...
# మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే

- మున్సిపల్ కార్మికులకు చైర్మన్ పిలుపు

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి ప్రాంతంలో గురువారం ఉదయం పారిశుద్ధ్య కార్మికులతో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ సమావేశమై నేరుగా కార్మికులను ఉద్దేశించి కీలక సూచనలు చేశారు. కొత్తపల్లి, రామన్నపల్లి, ధర్మారం ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడుతూ, "మీరు చేస్తున్న సేవల వల్లే పట్టణం పరిశుభ్రంగా, ప్రజలకు ఆరోగ్యకరంగా ఉంటుంది" అని అభినందించారు.
"ప్రతి ఒక్కరు తమకు కేటాయించిన వార్డులో సమయానికి పనులు పూర్తి చేయాలి. పనుల్లో ఆలస్యం లేకుండా వేగంగా పనిచేయాలి. ప్రజలతో, కౌన్సిలర్లతో గౌరవంగా మెలగడం కూడా మీ బాధ్యతలో భాగమే" అని స్పష్టం చేశారు.
ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, "విధుల సమయంలో నీరు, నిమ్మరసం తప్పనిసరిగా తీసుకోవాలి. మీ ఆరోగ్యం మీ కుటుంబానికి ఎంతో ముఖ్యమైనది... మీరు బాగుంటేనే మీ కుటుంబం బాగుంటుంది" అంటూ హితవు పలికారు. పనిలో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే తెలియజేయాలని, కార్మికుల సంక్షేమం కోసం మున్సిపాలిటీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# చపాతి వివాదం ప్రాణం తీసిన క్షణికావేశం

**జమ్మికుంట, ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. ఎఫ్‌సీఐ గోదాం సమీపంలో నివసిస్తున్న బీహార్‌కు చెందిన రాహుల్ కుమార్ తన భార్య పూజ కుమారి (26), ముగ్గురు చిన్నపిల్లలతో కలిసి అద్దె ఇంటిలో జీవిస్తున్నారు.



గృహ వ్యవహారంలో భాగంగా చపాతి వేడిగా లేదన్న చిన్న విషయంపై దంపతుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఘటనతో మనస్తాపానికి గురైన పూజ కుమారి క్షణికావేశంలో తాను ధరించిన చీరతోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.
సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.
ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపగా, కుటుంబ కలహాలు ఎంత చిన్నవైనా తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

## జోగులాంబ గద్వాల్ జిల్లా
# డీసీసీ ఉపాధ్యక్షుడిగా వై ఎల్లారెడ్డి నియామకం



**జోగులాంబ గద్వాల్, ఏప్రిల్09(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా కాంగ్రెస్ కమిటీలో నూతనంగా ఉపాధ్యక్షుడిగా వై ఎల్లారెడ్డి నియమితులయ్యారు. రాజోలి మండలానికి చెందిన ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. జిల్లా డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో, ఏఐసీసీ కార్యదర్శి, ఛత్తీస్‌గఢ్ ఇంచార్జ్ డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ సహకారంతో ఈ నియామకం జరిగింది. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న సీనియర్ నేతగా గుర్తింపు పొందిన వై ఎల్లారెడ్డికి ఈ పదవి దక్కడం పట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.
రాజోలి మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి విశేషమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వై ఎల్లారెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, కార్యకర్తలతో సమన్వయం సాధిస్తూ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ నియామకాన్ని పురస్కరించుకుని రాజోలి ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, రైతులు, అభిమానులు ఆయనను అభినందించారు. ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డి, పులిపాటి దస్తగిరి, కె. వెంకటేశ్వర్లు, సత్తార్ మినా, అసిన్, సర్వీస్ రెడ్డి కృష్ణ తదితరులు సంతోషం వ్యక్తం చేశారు.

# టెక్నాలజీతో ముందుకు సాగండి

- కలెక్టర్ మను చౌదరి సూచన
- కూకట్‌పల్లి మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ సందర్శన
- విద్యార్థులతో భోజనం చేసి పలు సూచనలు





**మేడ్చల్ మల్కాజిగిరి, ఏప్రిల్ 9 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుని తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. గురువారం కూకట్‌పల్లి మండలంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ (బాలురు) పాఠశాల మరియు జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్, ప్రతిరోజూ మెనూ ప్రకారం సమయానికి పౌష్టికాహారం అందించాలని అధికారులకు ఆదేశించారు. వసతి గృహంలో బోధన విధానం గురించి ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, చదువుతో పాటు క్రీడలు, గేమ్స్, ఇతర అభిరుచుల్లో కూడా ప్రతిభ కనబరచాలని సూచించారు. ప్రభుత్వం అవసరమైన శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని, బిడియాన్ని వదిలి తమకు తెలిసిన విషయాలను నలుగురిలో చెప్పగలగాలని సూచించారు. మారుతున్న టెక్నాలజీని వినియోగించుకుని స్మార్ట్ వర్క్ చేయాలని, సమయాన్ని ఆదా చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం చాట్ జిపిటి, జెమిని, పెర్ప్లెక్సిటీ వంటి ఎఐ సాధనాలు విస్తృతంగా వినియోగంలో ఉన్నాయని, వీటి ద్వారా పెయింటింగ్, వెబ్ డిజైనింగ్, ప్రోగ్రామింగ్, ఫ్యాషన్ టెక్నాలజీ రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని వివరించారు. మంచి అలవాట్లు అలవర్చుకుని, సబ్జెక్ట్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అకాడమిక్స్‌తో పాటు ప్రపంచ పరిణామాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి తహసీల్దార్ స్వామి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో అంబేద్కర్ జయంతి నిర్వహణపై టీజెఎస్ కీలక డిమాండ్

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):**

జమ్మికుంట పట్టణంలో ప్రతి సంవత్సరం నిర్వహించే డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఈసారి మరింత ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ జన సమితి (టి.జె.ఎస్) నాయకులు అరికిల్ల భానుచందర్, అరికిల్ల స్రవంతి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు జమ్మికుంట మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.
గత కొన్ని సంవత్సరాలుగా అంబేద్కర్ జయంతి వేడుకలు సరైన ఉత్సవ కమిటీ లేకుండా సాదాసీదాగా నిర్వహిస్తున్నారని వారు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు అపారమని, అలాంటి మహనీయుని జయంతి వేడుకలను గౌరవప్రదంగా, ఘనంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.
ఈ సంవత్సరం అంబేద్కర్ జయంతి వేడుకలకు ప్రత్యేక ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ ఆధ్వర్యంలో సమగ్రంగా కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వారు మున్సిపల్ అధికారులను కోరారు.




# వెంకటేశ్వర్లపల్లిలో ఇసుక మాఫియా అరాచకం

- రోజుకు 300 ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం

**జమ్మికుంట టౌన్ ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):**



కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లిలో ఇసుక మాఫియా ఆగడాలు రోజురోజుకు పెరుగుతూ గ్రామ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గత మూడు నెలలుగా కొనసాగుతున్న అక్రమ ఇసుక రవాణా కారణంగా గ్రామంలోని రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోజుకు కనీసం 300కు పైగా ట్రాక్టర్లు అధిక వేగంతో గ్రామంలో రాకపోకలు సాగిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసిన తర్వాత పరిస్థితి మరింత దిగజారిందని గ్రామస్థులు తెలిపారు. చెక్‌పోస్ట్ కారణంగా ఇసుక రవాణా అంతర్గత వీధుల వైపు మళ్లి, దుమ్ము, శబ్ద కాలుష్యం పెరిగి ప్రజల జీవన విధానం అస్తవ్యస్తమైంది.
ప్రత్యేకంగా పాఠశాలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు, మహిళలు రోడ్లపై నడవడమే ప్రమాదకరంగా మారిందని వారు చెబుతున్నారు. ఎప్పుడు ఏ ట్రాక్టర్ వేగంగా వస్తుందో తెలియని పరిస్థితిలో ప్రమాద భయం నెలకొంది. గతంలో చిన్నపాటి ప్రమాదాలు జరిగినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని, ఇసుక మాఫియా పోలీసులను సైతం తోసుకుని వెళ్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు కఠిన చర్యలు తీసుకుని అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# సేవే లక్ష్యం ఇల్లంతకుంటలో మిత్రబృందం కృషి

- యువతకు ఆదర్శంగా బాల్యమిత్రుల సేవ సమితి



**జమ్మికుంట టౌన్, ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట జెడ్పీ ఉన్నత పాఠశాల 198384 బ్యాచ్‌కు చెందిన బాల్యమిత్రులు 'బాల్య మిత్రుల సేవా సమితి'గా ఏర్పడి సమాజ సేవలో ఆదర్శంగా నిలుస్తున్నారు. కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో గత తొమ్మిది సంవత్సరాలుగా నిరంతరంగా చలివేంద్రాన్ని నిర్వహిస్తూ ప్రజలకు చల్లని తాగునీరు అందిస్తున్నారు.
2016 డిసెంబర్ 26న స్థాపించబడిన ఈ సమితి, బాల్య స్నేహాన్ని సేవా మార్గంగా మలచి విశేష గుర్తింపు పొందింది. ప్రతి సంవత్సరం వేసవిలో తీవ్ర ఎండల మధ్య గ్రామస్తులు, ప్రయాణికులకు ఉపశమనం కలిగించే విధంగా చలివేంద్రాన్ని నిర్వహించడం వారి ప్రత్యేకతగా నిలిచింది. రోజూ వందలాది మంది ఈ చలివేంద్రాన్ని వినియోగించుకుంటూ మిత్రబృందం సేవలను ప్రశంసిస్తున్నారు.
కరోనా మహమ్మారి సమయంలో కూడా ఈ మిత్రబృందం 41 రోజుల పాటు అల్పాహారం, మాస్కులు, సానిటైజర్లు ఉచితంగా పంపిణీ చేసి తమ సేవా దృక్పథాన్ని చాటుకుంది. కష్టకాలాల్లో ప్రజలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని సభ్యులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో రేపెల్లి సంపత్ కుమార్, గుండా సురేందర్, ముకిరాల సంపత్ రావు, హనుమాన్ల కొమురయ్య, మట్టేపల్లి ప్రకాష్, మట్ట వాసుదేవ రెడ్డి, కళ్యాణం రవీందర్ తదితరులు చురుకుగా పాల్గొంటున్నారు. స్థానిక ప్రజలు కూడా ఈ సేవా కార్యక్రమానికి సహకారం అందిస్తున్నారు.
భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి మరింత సేవ చేయాలని 'బాల్య మిత్రుల సేవా సమితి' సభ్యులు సంకల్పించారు. వారి సేవా స్ఫూర్తి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.





# రఘునాథపల్లి మండలంలో బీజేపీ ప్రశిక్షణ మహాభియాన్ కార్యక్రమం

**రఘునాథపల్లి,ఏప్రిల్09(తెలంగాణ ముచ్చట్లు):**

పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్-2026 కార్యక్రమం భాగంగా రఘునాథపల్లి మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో 24 గంటల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల పార్టీ అధ్యక్షుడు పుప్పాల వేణు కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత బలపరిచే అంశాలు, భవిష్యత్ కార్యాచరణపై నేతలు కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు. పెరుమాండ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి శిక్షణ కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కావటి ముత్యాలు, సీనియర్ నాయకులు కల్పగూరి ప్రభాకర్, మర్కాల వెంకటరెడ్డి, వల్లాల ఉపేందర్, వల్లపు తిరుమల్ ప్రసాద్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ద్యావర రాజు, మండల ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా యామంకి కొమురెల్లి, దైతల రంజిత్, సల్ల వాసుదేవ రెడ్డి, లెక్కల దామోదర్ రెడ్డి, దొరగొల్ల రవి, మల్కాపురం శ్రీకాంత్, కీర్తి వెంకటేశ్వర్లు, తోట మహేష్, బొల్లపల్లి నరేష్, ముప్పిడి అనిల్, గాజులపాటి వీరోజీ, మేడిపల్లి వెంకటేశ్వర్లు, బొల్ల అఖిల్ తదితర నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## బస్తీల్లో కరెంట్, నీటి సమస్యలు

- కాంగ్రెస్ నేత తక్షణ స్పందన
- ముస్లిం బస్తీ, శివాలయం బస్తీ పర్యటించిన జీడి సంపత్ కుమార్ గౌడ్
- అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

**మల్కాజ్గిరి, ఏప్రిల్ 9 (తెలంగాణ ముచ్చట్లు)**

ఓల్డ్ మల్కాజిగిరి 183వ డివిజన్ పరిధిలోని ముస్లిం బస్తీ మరియు శివాలయం టెంపుల్ బస్తీల్లో నెలకొన్న కరెంట్ మరియు తాగునీటి సమస్యలు స్థానిక ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.ఈ సమస్యలను బస్తీ వాసులు తెలియజేయడంతో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు జీడి సంపత్ కుమార్ గౌడ్ వెంటనే స్పందించారు. ఆయన బస్తీలను స్వయంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం విద్యుత్ శాఖ ఏఈ గోపాల్, వాటర్ వర్క్స్ డీజీఎం రమణలతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అవసరమైన చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని తెలిపారు.ముఖ్యంగా వృద్ధులు, వితంతువులకు త్వరలో మంజూరు కానున్న పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గౌసుదిన్ భాయ్, అహ్మద్, మక్బూల్, అలుగుల కుమార్ గౌడ్‌తో పాటు బస్తీ వాసులు పాల్గొన్నారు.



## బంగాల్‌లో నందిగ్రామ్ ఫలితం మళ్లీ పునరావృతం అవుతుంది

- ప్రధాని మోదీ
- భవానీపుర్‌లోనూ అదే ఫలితం వస్తుందని వ్యాఖ్యలు
- టీఎంసీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- బీజేపీ విజయం ఖాయమని ధీమా

**పశ్చిమ మేధినీపుర్, ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమ బెంగాల్‌లో రాబోయే ఎన్నికల్లో నందిగ్రామ్ ఫలితం మళ్లీ పునరావృతమవుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భవానీపుర్‌లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ మేధినీపుర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడిన మోదీ, 2021 ఎన్నికల్లో నందిగ్రామ్‌లో మమతా బెనర్జీపై బీజేపీ నేత సువేందు అధికారి సాధించిన విజయాన్ని ప్రస్తావించారు. ఈసారి కూడా ప్రజలు అదే విధంగా తీర్పు ఇవ్వబోతున్నారని చెప్పారు.

బంగాల్‌లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు సాధారణ ఎన్నికలు కావని, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే కీలక ఎన్నికలని ఆయన పేర్కొన్నారు. బంగాల్ వైభవాన్ని పునరుద్ధరించడానికి ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. టీఎంసీ ప్రభుత్వంపై మోదీ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో తీసుకెళ్లకుండా వెనక్కి లాగుతోందని ఆరోపించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లేకపోవడం, ఉన్న అవకాశాలను కూడా చొరబాటుదారులకు ఇస్తున్నారని మోదీ ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో అవకతవకలు జరుగుతున్నాయని అన్నారు.

ఈ నేపథ్యంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, బీజేపీకి విజయం ఖాయమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. బంగాల్ అభివృద్ధి కోసం ప్రజలు సరైన నిర్ణయం తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మదురై తీర్పు... లాకప్ హింసకు చివరి హెచ్చరికా?

చట్టం ఒక దేశానికి కేవలం నియమాల సమాహారం కాదు. అది మనిషి గౌరవాన్ని కాపాడే ఒక నైతిక వాగ్దానం. ఆ వాగ్దానం అత్యంతగా పరీక్షించబడేది పోలీసు స్టేషన్లలోనే. ఒక వ్యక్తి నేరం చేశాడా లేదా అన్నది కోర్టు నిర్ణయించాల్సిన విషయం. కానీ అనేక సందర్భాల్లో ఆ నిర్ణయం కోర్టు ముందు కాకుండా పోలీసు లాకప్లోనే జరుగుతున్నట్లు కనిపిస్తుంది. ఇదే నేపథ్యంలో తమిళనాడులోని మదురై కోర్టు ఇచ్చిన సంచలన తీర్పు దేశవ్యాప్తంగా ఒక పెద్ద చర్చకు దారి తీసింది.

ఈ నేపథ్యంలో తమిళనాడులోని మదురై కోర్టు ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా ఒక తీవ్రమైన చర్చకు కారణమైంది. 2020లో జరిగిన శాతాంకుళం కస్టడీ మరణాల కేసులో వ్యాపారి P. Jayaraj మరియు అతని కుమారుడు J. Bennix పోలీసు కస్టడీలో తీవ్ర హింసకు గురై మరణించారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేపింది. ఆరుగేళ్ల విచారణ తర్వాత కోర్టు తొమ్మిది మంది పోలీసులను దోషులుగా తేల్చి మరణశిక్ష విధించడం ఒక అరుదైన తీర్పుగా నిలిచింది. కోర్టు ఈ కేసును “rarest of rare” గా పేర్కొంది.

ఈ తీర్పు కేవలం ఒక కేసుకు సంబంధించిన న్యాయ నిర్ణయం మాత్రమే కాదు. ఇది భారతదేశంలోని పోలీసు వ్యవస్థ, కస్టడీ హింస, మానవ హక్కులు, మరియు ప్రజాస్వామ్య నైతికత గురించి పెద్ద ప్రశ్నలను లేవనెత్తింది.

**చట్టానికి ముందు జీవించే హక్కు :**

ఏ ప్రజాస్వామ్య దేశంలోనైనా చట్టం యొక్క అసలు ఉద్దేశ్యం కేవలం శిక్షించడం కాదు——మనిషి గౌరవం మరియు ప్రాథమిక హక్కులను కాపాడటం. భారత రాజ్యాంగంలోని Article 21 of the Constitution of India ప్రతి వ్యక్తికి జీవించే హక్కు మరియు గౌరవంగా జీవించే హక్కును హామీ ఇస్తుంది. ఈ హక్కు నిరపరాధులకే కాదు; నేర ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికీ వర్తిస్తుంది. ఒక వ్యక్తి నేరం చేశాడనే అనుమానం ఉన్నంత మాత్రాన అతని మౌలిక హక్కులు రద్దు కావు.

పోలీసులకు చట్టం కొన్ని అధికారాలు ఇచ్చింది నిందితుడిని అరెస్ట్ చేయడం, విచారణ చేయడం, సాక్ష్యాలు సేకరించడం, కోర్టులో కేసు నమోదు చేయడం. కానీ ఈ అధికారాలు ఒక స్పష్టమైన పరిమితితో వస్తాయి: హింసకు చట్టం అనుమతి ఇవ్వదు.



కొట్టి ఒప్పుకోలు రాబట్టడం, శారీరక లేదా మానసిక హింస చేయడం, విచారణ పేరుతో ప్రాణాలు తీసేయడం చట్టబద్ధం కాదు. విచారణ అనేది నిజాన్ని వెలికితీయడానికి ఉండాలి; ప్రతీకారం తీర్చుకోవడానికి కాదు. ఈ విషయాన్ని D. K. Basu vs State of West Bengal కేసులో సుప్రీంకోర్టు స్పష్టంగా పేర్కొంది. అరెస్టు సమయంలో పాటించాల్సిన కొన్ని మార్గదర్శకాలు కూడా ప్రకటించింది. అరెస్టు కారణం తెలియజేయడం, న్యాయవాది సహాయం పొందే హక్కు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడం, వైద్య పరీక్ష చేయించడం, అలాగే అరెస్టు చేసిన వ్యక్తిని 24 గంటల్లో కోర్టు ముందు హాజరు పరచడం వంటి నియమాలు నిందితుడి హక్కులను రక్షించడానికి ఏర్పాటు చేయబడ్డాయి.

ఈ నియమాలు ప్రతి మనిషి గౌరవాన్ని కాపాడటానికి రూపొందించబడ్డాయి. అయినప్పటికీ దేశంలో జరిగే కస్టడీ హింస, లాకప్ మరణాలు ఈ నియమాలు ఎంతవరకు అమలు అవుతున్నాయనే ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. అందుకే ఒక విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి చట్టం ఒక వ్యక్తిని నిందితుడిగా చూడవచ్చు, కానీ అతని మానవత్వాన్ని తుడిచేయలదు. ఇది కేవలం చట్టపరమైన నియమం మాత్రమే కాదు ఒక నాగరిక సమాజానికి అవసరమైన నైతిక ప్రమాణం.

**21వ శతాబ్దంలో కూడా లాకప్ మరణాలు దీనికి సంకేతం ?**

సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారతదేశం ప్రపంచ వేదికపై ఎదుగుతోంది. కానీ అదే సమయంలో లాకప్ మరణాలు కొనసాగడం ఒక తీవ్రమైన హెచ్చరిక. ఇది కేవలం చట్ట సమస్య కాదు. ఇది ప్రజాస్వామ్య విలువలకు సంబంధించిన సమస్య. ప్రజల భద్రత కోసం ఉన్న వ్యవస్థ ప్రజల ప్రాణాలకు ప్రమాదంగా మారితే ప్రజాస్వామ్యం ఎలా నిలబడుతుంది? చట్టం ప్రజలను రక్షించడానికి ఉండాలి. పోలీసు స్టేషన్ ప్రజలు భయపడే స్థలం కాకుండా న్యాయం అందించే స్థలంగా మారాలి.

21వ శతాబ్దంలో కూడా జరుగుతున్న లాకప్ మరణాలు ఒక స్పష్టమైన హెచ్చరిక. చట్టం ఉన్నంత మాత్రాన న్యాయం సాధ్యం కాదు. చట్టాన్ని అమలు చేసే వ్యవస్థలు మానవత్వాన్ని గౌరవించినప్పుడు మాత్రమే నిజమైన న్యాయం సాధ్యమవుతుంది.

**మదురై తీర్పు ఇచ్చిన సంకేతం :**

ఈ తీర్పు మూడు ముఖ్యమైన సందేశాలను ఇస్తుంది. మొదటిది యూనిఫామ్ చట్టానికి మించి కాదు. పోలీసు అధికారులకు కూడా రాజ్యాంగం వర్తిస్తుంది. రెండవది న్యాయం ఆలస్యమవుతుందేమో కానీ పూర్తిగా మాయం కాదు. బాధిత కుటుంబం దీర్ఘకాల పోరాటం తర్వాత న్యాయం పొందగలిగింది. మూడవది పోలీసు సంస్కరణల అవసరం మళ్లీ చర్చకు వచ్చింది. అయితే ఒకే తీర్పుతో వ్యవస్థ పూర్తిగా మారిపోదు. మార్పు రావాలంటే నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం.

**నిజం వైపు నిలిచిన ఒక పోలీస్ రేవతి :**

ఈ కేసులో న్యాయం గెలవడం వెనుక చాలా మంది సాక్షులు ఉన్నప్పటికీ ప్రధాన సాక్షి, మహిళా కానిస్టేబుల్ రేవతి కృషి మరువలేం. సొంత డిపార్ట్‌మెంట్ నుంచే బెదిరింపులు ఉన్నప్పటికీ బెదరకుండా సాక్ష్యం చెప్పారు. పోలీసు వ్యవస్థలో క్రమశిక్షణ, ఆదేశాలు, మరియు సంస్థకు విధేయత ముఖ్యమైన విలువలుగా భావిస్తారు. కానీ కొన్ని సందర్భాల్లో నిజం చెప్పడం ఆ విలువలకంటే పెద్ద బాధ్యతగా మారుతుంది. అలాంటి సందర్భాల్లో నిజం వైపు నిలబడటం చాలా ధైర్యం కోరుకుంటుంది. తమిళనాడులోని శాతాంకుళం కస్టడీ మరణాల కేసులో అదే ధైర్యాన్ని చూపింది మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఎస్.రేవతి. విచారణలో ఆమె చెప్పిన వివరాలు కేసు దిశను పూర్తిగా మార్చాయి. నిజం బయటకు రావడానికి ఆమె చూపిన ధైర్యం వల్లే ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. రేవతి కథ ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తుంది. యూనిఫామ్ ధరించడం కేవలం అధికారాన్ని సూచించదు, అది బాధ్యతను కూడా సూచిస్తుంది. చట్టాన్ని కాపాడే వ్యవస్థలో ఉన్నవారు నిజం వైపు నిలబడితేనే న్యాయం బలపడుతుంది. అందుకే ఈ ఘటనలో రేవతి పాత్ర ఒక వ్యక్తి ధైర్యానికి మాత్రమే కాదు నిజం కోసం నిలబడే నైతిక ధైర్యానికి కూడా ప్రతీకగా నిలిచింది.

చట్టం అనేది కేవలం పుస్తకాలలో ఉండే అక్షరాలు కాదు మనిషి జీవితం, గౌరవం, స్వేచ్ఛలను రక్షించడానికి సమాజం చేసుకున్న ఒక నైతిక ఒప్పందం. ఒక వ్యక్తి నిందితుడిగా పోలీస్ స్టేషన్‌లోకి అడుగుపెడితే, అతను అక్కడి నుంచి న్యాయ ప్రక్రియ ద్వారా బయటకు రావాలి. కానీ అదే వ్యక్తి శవంగా బయటకు వస్తే అది కేవలం ఒక మనిషి మరణం కాదు అది న్యాయం మీద ప్రజల నమ్మకాన్ని కదిలించే ఒక తీవ్రమైన గాయం. ప్రజాస్వామ్యానికి అసలు బలం ఆయుధాల్లో కాదు న్యాయం పట్ల ఉన్న కట్టుబాటులో ఉంటుంది. పోలీసు వ్యవస్థ ప్రజలకు భయాన్ని కలిగించే అధికారంగా కాకుండా, వారి హక్కులను కాపాడే బాధ్యతగల వ్యవస్థగా మారినప్పుడే న్యాయం నిజంగా నిలబడుతుంది.

మనిషి ప్రాణం కంటే పెద్ద చట్టం ఏదీ లేదు అదే ఒక నాగరిక సమాజానికి అసలు ప్రమాణం.



బసడ సంపత్ యాదవ్
7032132593

## మొక్కజొన్న కొనుగోలులో ప్రభుత్వం విఫలం

- ప్రతి గ్రామంలో కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- ఎకరానికి 26 క్వింటాళ్ల నిబంధన ఎత్తివేయాలని డిమాండ్
- తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన రైతు నాయకులు

**ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 9(తెలంగాణ ముచ్చట్లు)**

రాష్ట్రంలో మొక్కజొన్న సాగు చేసిన రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతుబంధు జిల్లా నాయకులు మంకెన రమేష్ విమర్శించారు. మొక్కజొన్న కొనుగోలులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రభుత్వం విధిస్తున్న నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఈ క్రింది చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు



**గ్రామాల్లో కేంద్రాలు:**

రైతులు తమ పంటను సుదూర ప్రాంతాలకు తరలించలేక ఇబ్బంది పడుతున్నారని, కావున ప్రతి గ్రామంలోనూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

**నిబంధనల సడలింపు:**

ఎకరానికి కేవలం 26 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాలన్న నిబంధనను వెంటనే ఎత్తివేసి, ఎకరానికి 40 క్వింటాళ్ల పైబడి పంటను సేకరించాలి.

**త్వరితగతిన మార్పిడి:**

కొనుగోలు ప్రక్రియలో జాప్యం చేయకుండా, వెంటనే మార్పిడి (ప్రొకర్మెంట్) ఏర్పాటు చేసి రైతుల నుంచి పంటను వేగంగా సేకరించాలి.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, వైస్ ఎంపీపీ కొనుగోటి రత్నాకర్, గురజాల హనుమంతరావు,మండల కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, సర్పంచులు కొండూరి పరిశుద్ధ రావు, చేపల మడుగు వీరబాబు, తిర్లాపురం సర్పంచ్ పాల్గొన్నారు. అలాగే రైతుబంధు మాజీ గ్రామ అధ్యక్షులు గడ్డం శ్రీనివాసరావు, నన్నక కోటయ్య, ఆకుల చంద్రయ్య, యువజన అధ్యక్షులు పిన్నెల్లి శ్రీనివాసరావు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు చెవుల వెంకటప్రసాద్, నన్నక నరసరావు, నన్నక గోవిందరావు, మాజీ సర్పంచ్ నామవరం కొండలు, గాంధీనగర్ అధ్యక్షుడు కొండలు, సోమా నాగేశ్వరావు, పలనీడి కొండలు, అంజయ్య (పిఎస్సీ మాజీ డైరెక్టర్), జరగబోయన కృష్ణ (మత్స్యకార సంఘం అధ్యక్షులు), బంధం చిన్నకృష్ణ, గోగు నరసరావు, కొప్పూరు నవీన్, ఎస్.కె మేరా సాబ్, ఆదినారాయణ, అల్లిక నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## శబరిమల ప్రవేశంపై సుప్రీంకోర్టులో వాదనలు

- మత విశ్వాసాల అంశమని కేంద్రం అభిప్రాయం
- మహిళల ప్రవేశ ఆంక్షలపై కేంద్రం సమర్థన
- పురుషులకూ కొన్ని ఆలయాల్లో పరిమితులు ఉన్నాయని వాదన
- మత ఆచారాలపై నిర్ణయాధికారం కోర్టుకుందా అనే చర్చ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** శబరిమల ఆలయంలో 10 నుంచి 50 ఏళ్ల మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షల విషయంలో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో తన వాదనలు కొనసాగించింది. ఇది మత విశ్వాసాలకు సంబంధించిన అంశమని, రాజ్యాంగ నైతికతతో కాకుండా సంప్రదాయాల ప్రాతిపదికన చూడాలని కేంద్రం అభిప్రాయపడింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ అంశంపై విచారణ కొనసాగిస్తోంది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ వాదనలు వినిపించారు.

వాదనల సందర్భంగా దేశంలోని పలు ఆలయాల్లో పురుషులకు కూడా ప్రవేశం నిషేధం ఉన్న విషయాన్ని తుషార్ మెహతా ప్రస్తావించారు. కొట్టంకులంగర దేవి ఆలయంలో పురుషులు ప్రత్యేక ఆచారాల ప్రకారం మహిళల్లా వేషధారణలో మాత్రమే ప్రవేశిస్తారని తెలిపారు. అందువల్ల మత ఆచారాలు లింగ వివక్షపై ఆధారపడవని వాదించారు.

మత విశ్వాసాలను పురుషాధిక్యంగా లేదా మహిళాధిక్యంగా చూడలేమని కేంద్రం పేర్కొంది. శబరిమల వ్యవహారం భక్తుల విశ్వాసాలకు సంబంధించినదిగా పరిగణించాల్సిన అవసరం ఉందని తెలిపింది. రాజ్యాంగ నైతికత మత ఆచారాలపై రుద్దకూడదని కూడా కేంద్రం అభిప్రాయపడింది.

అయితే మతపరమైన ఆచారాల్లో ఏది మూఢనమ్మకమో నిర్ణయించే అధికారం న్యాయస్థానానికి ఉందని సుప్రీంకోర్టు గత విచారణలో స్పష్టం చేసింది. న్యాయమూర్తులు చట్టపరమైన అంశాల్లో నిపుణులు అయినప్పటికీ, మత ఆచారాలపై నిర్ణయాలు తీసుకోవడం కూడా వారి పరిధిలోకి వస్తుందని వ్యాఖ్యానించింది. ఈ కేసు నేపథ్యంగా 2018లో సుప్రీంకోర్టు మహిళల ప్రవేశాన్ని అనుమతిస్తూ చారిత్రక తీర్పు ఇచ్చింది. అనంతరం దాఖలైన పునర్విచారణ పిటిషన్లను పరిగణనలోకి తీసుకుని ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేశారు. ప్రస్తుతం వివిధ మతాల్లో మహిళల హక్కులు, మత స్వేచ్ఛ అంశాలపై విచారణ కొనసాగుతోంది.



# బంగారం ధరలు తగ్గుముఖం



అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల మధ్య బంగారం ధరలు మళ్లీ తగ్గడం వినియోగదారులకు కొంత ఊరటనిచ్చింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా నిన్న పెరిగిన ధరలు, ఈరోజు తగ్గుముఖం పట్టాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు, ఇరాన్ ప్రాంతాల్లో జరిగిన పరిణామాలు ప్రపంచ మార్కెట్లపై ప్రభావం చూపడంతో స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. ఈ ప్రభావంతో బంగారం ధరల్లో మార్పులు చోటుచేసుకున్నాయి.

హైదరాబాద్ మార్కెట్‌లో నిన్న 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,53,820గా ఉండగా, ఈరోజు అది రూ.1,51,480కు తగ్గింది. అలాగే 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,41,000 నుంచి రూ.1,38,850కు పడిపోయింది. 18 క్యారెట్ల బంగారం కూడా రూ.1,15,370 నుంచి రూ.1,13,610కు తగ్గింది. ఒక్కరోజులోనే వేల రూపాయల తగ్గుదల నమోదు కావడం గమనార్హం.

దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా ఇదే ధోరణి కొనసాగింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, బెంగళూరులో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,480గా నమోదైంది. ఢిల్లీలో రూ.1,51,630, చెన్నై, మధురై, కోయంబత్తూరులో రూ.1,52,730గా ఉంది. సూరత్‌లో రూ.1,51,530గా నమోదైంది.

మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, ముడి చమురు ధరలు, డాలర్ విలువ మార్పులు వంటి అంశాలు బంగారం ధరలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. భవిష్యత్తులో కూడా ఈ పరిస్థితులు కొనసాగితే ధరల్లో ఇలాంటి హెచ్చుతగ్గులు కనిపించే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.

మొత్తంగా చూస్తే, ప్రస్తుతం బంగారం ధరలు తగ్గడం కొనుగోలుదారులకు మంచి అవకాశం అని భావించవచ్చు. అయితే మార్కెట్ పరిస్థితులను గమనిస్తూ కొనుగోలు నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# విమాన టిక్కెట్లకు ఊరట



పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావంతో జెట్ ఇంధన ధరలు భారీగా పెరగడంతో విమాన టిక్కెట్ల ధరలు పెరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశీయ ప్రయాణికులకు కొంత ఉపశమనం కల్పించేందుకు విమానయాన సంస్థలపై పడుతున్న భారం తగ్గించే దిశగా చర్యలు చేపట్టింది.

దేశంలోని ప్రధానం కాని విమానాశ్రయాలలో ల్యాండింగ్, పార్కింగ్ ఛార్జీలను 25 శాతం మేర తగ్గిస్తూ కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వచ్చి వచ్చే మూడు నెలల పాటు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఈ రాయితీ వల్ల విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చులు తగ్గి, ప్రయాణికులపై పడే భారం కొంత మేర తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదే విధంగా ప్రధాన విమానాశ్రయాల్లో కూడా ఇలాంటి రాయితీలను అమలు చేసే అంశాన్ని సంబంధిత నియంత్రణ సంస్థ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ చర్యల ద్వారా విమానయాన రంగానికి సుమారు వందల కోట్ల రూపాయల మేర ఆర్థిక ఉపశమనం లభిస్తుందని అంచనా వేస్తున్నారు.

ఇటీవల అంతర్జాతీయ మార్కెట్‌లో జెట్ ఇంధన ధరలు దాదాపు రెట్టింపు కావడంతో విమానయాన సంస్థలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఇంధన ధరల పెరుగుదల కారణంగా ఇప్పటికే విమానయాన సంస్థలు అదనపు ఛార్జీలు విధించాల్సి వచ్చిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విమాన టిక్కెట్ల ధరలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషించనుంది. పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైతే ఈ రాయితీలను మరింత కాలం పొడిగించే అవకాశముందని అధికారులు సంకేతాలు ఇచ్చారు. మొత్తంగా చూస్తే, అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో పెరిగిన విమాన ప్రయాణ ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలు సాధారణ ప్రయాణికులకు కొంత ఊరటనిస్తాయని భావిస్తున్నారు.

# తక్కువ ధరకే కాలింగ్ ప్లాన్‌లు




టెలికాం రీఛార్జ్ ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న సామాన్య వినియోగదారులకు ట్రాయ్ శుభవార్త అందించింది. డేటా అవసరం లేని వారికి కేవలం కాల్స్, ఎస్ఎంఎస్ సౌకర్యాలు మాత్రమే కలిగిన తక్కువ ధర ప్లాన్‌లను తీసుకురావాలని టెలికాం సంస్థలకు సూచించింది.

ప్రస్తుతం ఎక్కువగా అందుబాటులో ఉన్న రీఛార్జ్ ప్లాన్‌లు డేటాతో కలిపి ఉండటం వల్ల ఇంటర్నెట్ వినియోగం చేయని వినియోగదారులు కూడా అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు ట్రాయ్ కొత్త మార్గదర్శకాలను సిద్ధం చేసింది. ప్రతి టెలికాం సంస్థ కనీసం ఒక వాయిస్ కాల్, ఎస్ఎంఎస్ ప్లాన్‌ను తప్పనిసరిగా అందించాలని స్పష్టం చేసింది. డేటా లేకుండా ఉండే ఈ ప్లాన్‌ల ధరలు సాధారణ ప్లాన్‌ల కంటే తక్కువగా ఉండాలని సూచించింది. అలాగే ఈ ప్లాన్‌లు కేవలం దీర్ఘకాల వాలిడిటీతోనే కాకుండా, తక్కువ రోజుల వాలిడిటీతో కూడా అందుబాటులో ఉండేలా చేయాలని ఆదేశించింది. దీంతో వినియోగదారులు తమ అవసరాలకు అనుగుణంగా ప్లాన్‌ను ఎంచుకునే అవకాశం పొందుతారు.

గతంలో కూడా ఇలాంటి ఆదేశాలు వచ్చినప్పటికీ కొన్ని సంస్థలు ధరలను తగ్గించకుండా పెద్దగా ప్రయోజనం కలిగించలేకపోయాయి. అయితే ఈసారి తీసుకొచ్చిన సవరణలతో వినియోగదారులకు నిజమైన లాభం చేకూరే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, వృద్ధులు వంటి డేటా వినియోగం తక్కువగా ఉన్న వారికి ఈ నిర్ణయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ మార్పులతో టెలికాం రంగంలో పారదర్శకత పెరగడంతో పాటు కంపెనీల మధ్య ఆరోగ్యకరమైన పోటీ కూడా పెరిగే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా ఈ నిర్ణయం వినియోగదారులకు తక్కువ ఖర్చుతో మెరుగైన సేవలను అందించే దిశగా కీలకంగా మారనుంది.

# మార్కెట్లకు బ్రేక్




గత ఐదు రోజులుగా లాభాల దిశగా పరిగెత్తిన దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం ఒక్కసారిగా కుదేలయ్యాయి. అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా చమురు ధరల పెరుగుదలతో పాటు అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న అనిశ్చితి మదుపరుల మనోభావాలను ప్రభావితం చేయడంతో భారీ అమ్మకాల ఒత్తిడి నెలకొంది.

ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 931.25 పాయింట్లు పడిపోయి 76,631.65 వద్ద ముగియగా, నిఫ్టీ 222.25 పాయింట్లు కోల్పోయి 23,775.10 వద్ద స్థిరపడింది. ఉదయం ప్రారంభం నుంచే మార్కెట్‌లో బలహీనత కనిపించగా, రోజు పొడవునా అమ్మకాలు కొనసాగాయి. ప్రముఖ కంపెనీల షేర్లు నష్టాల్లో ముగియడంతో సూచీలపై ప్రభావం స్పష్టంగా కనిపించింది. రంగాల వారీగా పరిశీలిస్తే బ్యాంకింగ్ రంగం షేర్లు మార్కెట్‌ను కిందికి లాగగా, కొన్ని మెటల్ షేర్లు మాత్రమే స్వల్ప మద్దతు ఇచ్చాయి. అయితే ప్రధాన సూచీలు పడిపోయినప్పటికీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు స్వల్ప లాభాలతో ముగియడం కొంత ఊరటనిచ్చే అంశంగా మారింది.

అంతర్జాతీయంగా అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణపై స్పష్టత లేకపోవడం, ఇంధన ధరలు పెరగడం వంటి అంశాలు మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాల కారణంగా మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో మార్కెట్లు క్షీణించాయి. ఇదే సమయంలో రూపాయి విలువలో కూడా ఒడిదుడుకులు కనిపించాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, నిఫ్టీ కీలక స్థాయికి దిగువకు వెళితే మరింత అమ్మకాల ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అంతర్జాతీయ పరిణామాలు సానుకూలంగా మారే వరకు మార్కెట్లలో అస్థిరత కొనసాగవచ్చని వారు అంచనా వేస్తున్నారు. మొత్తంగా ఐదు రోజుల లాభాల జోరుకు బ్రేక్ పడటంతో మదుపరుల్లో ఆందోళన నెలకొంది.

# సైయెంట్ కినెటెక్ కొనుగోలు




చిప్‌ల తయారీ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సైయెంట్ అనుబంధ సంస్థ సైయెంట్ సెమికండక్టర్ కీలక అడుగు వేసింది. అమెరికాకు చెందిన పవర్ సెమికండక్టర్ సొల్యూషన్ సంస్థ కినెటిక్ టెక్నాలజీలో మెజార్టీ వాటాను కొనుగోలు చేసింది. ఈ ఒప్పందం ద్వారా సుమారు 74 శాతం వాటాను రూ.785 కోట్లకు హస్తగతం చేసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. చిప్‌ల యారీలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం లక్ష్యంగా ఈ భాగస్వామ్యాన్ని ఏర్పరచుకున్నట్లు సంస్థ అధికారులు తెలిపారు. అమెరికా సంస్థతో కలిసి పనిచేయడం ద్వారా సెమికండక్టర్ రంగంలో తన స్థాయిని మరింత బలోపేతం చేసుకోవాలని సైయెంట్ భావిస్తోంది. ఈ కొనుగోలు ద్వారా గ్లోబల్ మార్కెట్లో పోటీ సామర్థ్యం పెరిగే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

సైయెంట్ సెమికండక్టర్ ప్రధాన అధికారి సుమన్ నారాయణ్ మాట్లాడుతూ, భవిష్యత్తులో చిప్‌ల తయారీ రంగంలో పెద్ద అవకాశాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకునేందుకు ఈ ఒప్పందం కీలకమని తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా సాంకేతిక పరిజ్ఞానం, ఉత్పత్తి సామర్థ్యం రెండింటినీ విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

## హ్యుండయ్ కార్ల ధరల పెంపు

ప్రముఖ కార్ల తయారీ సంస్థ హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే మే 1 నుంచి తన పోర్టుఫోలియోలోని అన్ని కార్ల ధరలను 1 శాతం వరకు పెంచనున్నట్లు ప్రకటించింది.

ఇన్‌పుట్ వ్యయాలు గణనీయంగా పెరగడం వల్ల కంపెనీపై ఆర్థిక భారం అధికమైందని, దాన్ని కొంతవరకు వినియోగదారులకు బదిలీ చేయాల్సిన అవసరం ఏర్పడిందని సంస్థ వెల్లడించింది. ఉత్పత్తి ఖర్చులు, ముడి సరుకుల ధరలు, రవాణా వ్యయాలు పెరగడం ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా పేర్కొంది.

ఈ ధరల పెంపు మే 1 నుంచి అమల్లోకి రానుండగా, వివిధ మోడళ్లపై పెరుగుదల శాతం స్వల్పంగా మారవచ్చని కంపెనీ తెలిపింది. దీంతో కొత్త కార్లు కొనాలనుకునే వినియోగదారులు ముందుగానే కొనుగోలు చేయాలని పరిశ్రమ వర్గాలు సూచిస్తున్నాయి.

# కేంద్రం ఇంటిపై సోలార్ ప్యానెల్స్‌కి రూ.78,000 సబ్సిడీ

ప్రతి నెలా పెరుగుతున్న విద్యుత్ బిల్లులు సామాన్య కుటుంబాల బడ్జెట్‌ను భారంగా మార్చుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం "పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన"ను ప్రారంభించింది. ఈ పథకం కింద ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తే, విద్యుత్ బిల్లులు దాదాపు సున్నా అవుతాయి. ప్రభుత్వం గరిష్టంగా రూ.78,000 వరకు సబ్సిడీ అందిస్తోంది. 1 కిలోవాట్ సిస్టమ్‌కు రూ.30,000, 2 కిలోవాట్‌కు రూ.60,000, 3 కిలోవాట్ లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి రూ.78,000 నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. దీని ద్వారా సాధారణ ప్రజలు భారీ పెట్టుబడి లేకుండా సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవచ్చునని ప్రభుత్వం పేర్కొంది. మిగిలిన ఖర్చుల కోసం బ్యాంకులు తక్కువ వడ్డీ రేట్లతో రుణాలను అందిస్తున్నాయి. రుణ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ఆధార్, విద్యుత్ బిల్లు, మొబైల్ నంబర్ వంటి ప్రాథమిక పత్రాలతో 15-20 నిమిషాల్లో దరఖాస్తు పూర్తి చేయవచ్చు. ఒకటి లేదా రెండు రోజుల లోపు రుణం మంజూరు అవుతుంది. ఈ పథకం కింద 10 సంవత్సరాల తిరిగి చెల్లింపు గడువు, ప్రారంభంలో 6 నెలల మారటోరియం సౌకర్యం కూడా ఉంది. అదనంగా 'నెట్ మీటరింగ్' ద్వారా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి అదనపు ఆదాయం పొందవచ్చు. సోల్ విద్యుత్ వైపు మారడం వల్ల ఖర్చులు తగ్గడమే కాకుండా దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కూడా లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం సామాన్యులకు విద్యుత్ స్వావలంబన సాధించడానికి ఒక కీలక అవకాశం అని ప్రత్యేకంగా సూచిస్తోంది.





తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# థియేటర్‌లో ప్రభాస్ సందడి

బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతున్న 'ధురంధర్ 2' చిత్రం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రముఖ హీరో ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి కలిసి హైదరాబాద్‌లోని ఓ థియేటర్‌లో ఈ సినిమాను ప్రేక్షకులతో కలిసి వీక్షించడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. సాధారణంగా బహిరంగంగా ఎక్కువగా కనిపించని ప్రభాస్ ఇలా అభిమానుల మధ్య సినిమా చూడటం అరుదైన ఘటనగా భావిస్తున్నారు.

ఈ చిత్రంలో నటుడు రణవీర్ సింగ్ చూపించిన ఉత్సాహభరిత నటనకు ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందనను ప్రత్యక్షంగా గమనించిన ప్రభాస్ ఆనందం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రేక్షకుల స్పందనను దగ్గరగా చూడడం ద్వారా సినిమా ప్రభావాన్ని అర్థం చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ ప్రయత్నం జరిగినట్లు తెలుస్తోంది.

ఇటీవల ప్రభాస్ సినిమాల్లో పాత ఉత్సాహం కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్న నేపథ్యంలో, తన తదుపరి చిత్రానికి కొత్త ఉత్సాహంతో సిద్ధమవ్వాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. సందీప్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కనున్న 'స్పిరిట్' చిత్రం కోసం ప్రభాస్ తనలో మార్పులు తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రేక్షకుల మధ్య కూర్చొని సినిమా చూడడం ద్వారా వారి అంచనాలు, స్పందనలు ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చని భావించిన దర్శకుడు సందీప్ రెడ్డి ఈ ప్రణాళిక రూపొందించినట్లు చెబుతున్నారు. ఈ అనుభవం ప్రభాస్‌లో మళ్లీ పాత జోష్‌ను తీసుకురావడంలో కీలక పాత్ర పోషించవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మొత్తంగా చూస్తే, ఈ థియేటర్ సందర్శన కేవలం సినిమా వీక్షణకే పరిమితం కాకుండా, ప్రభాస్ భవిష్యత్ ప్రాజెక్టులకు కొత్త దిశను చూపించే అడుగుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అభిమానులు కూడా ఆయన నుంచి మరింత శక్తివంతమైన నటనను ఆశిస్తూ ఎదురుచూస్తున్నారు.

# సుప్రియకు సమంత ప్రశంసలు

ప్రముఖ నటి సమంత తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. నిర్మాత సుప్రియ నిర్మిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్' విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, ఆమెకు సమంత ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

సమంత తన సందేశంలో సుప్రియ కష్టాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, "డెకాయిట్ సినిమా కోసం నువ్వు పడిన కష్టం, నీ పట్టుదల, అంకితభావం అన్నీ నేను స్వయంగా చూశాను. ఈ విజయానికి నీకంటే ఎవరూ అర్హులు కారు" అంటూ ప్రశంసలు కురిపించారు. అలాగే ఈ చిత్రం ఘన విజయాన్ని సాధించాలని కోరుతూ ఆమెకు ఆశీస్సులు తెలిపారు.





ప్రస్తుతం సమంత కథానాయికగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా రాణిస్తూ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. మరోవైపు 'డెకాయిట్' చిత్రంలో నటిస్తున్న అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటపై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలు కూడా జోరుగా కొనసాగుతున్నాయి.

ఈ సినిమాకు ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ప్రతినాయక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. విడుదల తేదీ సమీపిస్తున్న కొద్దీ చిత్రంపై హైప్ మరింత పెరుగుతోంది.

మొత్తంగా చూస్తే, సమంత చేసిన ఈ ప్రశంసలు 'డెకాయిట్' చిత్రానికి మరింత ప్రచారం తీసుకురావడమే కాకుండా, చిత్ర బృందానికి ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయి. ఇప్పుడు ఈ సినిమా ప్రేక్షకుల అంచనాలను ఎంతవరకు అందుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# 'రాకా'లో ద్విపాత్రాభినయం?

నటుడు అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'రాకా' చిత్రం ప్రస్తుతం సినీ వర్గాల్లో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదలైన వెంటనే విస్తృత చర్చకు దారి తీసింది. విడుదలైన పోస్టర్‌లో అల్లు అర్జున్ పూర్తిగా భిన్నమైన రూపంలో కనిపిస్తూ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించారు.

ముందు భాగంలో గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పుకున్న భయానక తీరు ఈ చిత్ర కథలో రహస్య అంశాలు ఉన్నాయనే సంకేతాలను ఇస్తోంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో పాత్ర ఉండొచ్చనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. ఈ రూపం కథలో కీలక మలుపుకు సంకేతమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో కథానాయికగా దీపిక పదుకొణే నటిస్తున్నట్లు సమాచారం. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని తెలుస్తోంది. మరోవైపు సీనియర్ నటి రమ్యకృష్ణ కూడా కీలక పాత్రలో కనిపించనున్నట్లు





ప్రచారం జరుగుతోంది. అల్లు అర్జున్ లుక్‌పై స్పందించిన ఆమె "సరిహద్దులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి" అని వ్యాఖ్యానించడం మరింత ఆసక్తిని పెంచింది.

ఇక ఈ చిత్రంలో అల్లు అర్జున్ ద్విపాత్రాభినయం చేయనున్నారనే వార్తలు సినీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఒకటి నాయకుడి పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉండొచ్చని అంటున్నారు. ప్రస్తుతం విడుదలైన భయానక రూపం ప్రతినాయక పాత్రదేనని భావిస్తున్నారు. అలాగే ఈ చిత్రంలో ఒకటి కంటే ఎక్కువ కథానాయికలు ఉండే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. 'రాకా' అనే పేరుకు రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయని, కథలో హీరోలోని చీకటి వైపు, విధ్వంసక శక్తిని ప్రతిబింబించేలా ఈ టైటిల్ ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రాన్ని భారీ వ్యయంతో తెరకెక్కిస్తున్నారని సమాచారం.



# రేణు దేశాయ్‌పై అసభ్య కామెంట్.. వ్యక్తి అరెస్ట్

నటి రేణు దేశాయ్‌పై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల తనపై జరుగుతున్న ఆన్‌లైన్ వేధింపులపై రేణు దేశాయ్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ చర్యలు తీసుకున్నారు.

పోలీసుల దర్యాప్తులో గుంటూరుకు చెందిన చెన్నయ్య రుంజాల అనే వ్యక్తి తన యూట్యూబ్ ఖాతా ద్వారా రేణు దేశాయ్ పోస్టుపై అభ్యంతరకర వ్యాఖ్య చేసినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న సైబరాబాద్ పోలీసులు గుంటూరుకు వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని గచ్చిబౌలి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో అతడు తన ఫోన్ నుంచే ఆ కామెంట్ పెట్టినట్లు అంగీకరించినట్లు అధికారులు తెలిపారు.

రేణు దేశాయ్ ఈ నెల ప్రారంభంలోనే తనపై జరుగుతున్న ఆన్‌లైన్ వేధింపులపై ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. వ్యక్తిగత జీవితంలోకి చొరబడుతూ అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. గతంలో కూడా ఇలాంటి వేధింపులు ఎదుర్కొంటున్నట్లు వెల్లడించారు.

ఈ ఘటన నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు హెచ్చరించారు. అసభ్యకర, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సైబర్ నేరాలకు సంబంధించి సమస్యలు ఎదురైతే వెంటనే హెల్ప్‌లైన్ లేదా సమీప సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

# స్పెషల్ సాంగ్ సస్పెన్స్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'పెద్ది' మరోసారి వార్తల్లో నిలిచింది. దర్శకుడు బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఇప్పుడు ఈ చిత్రంలోని స్పెషల్ సాంగ్‌లో ఎవరు కనిపించబోతున్నారు అనే అంశం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మొదట ఈ పాట కోసం బాలీవుడ్ నటి మృణాల్ ఠాగూర్ పేరు వినిపించగా, తాజాగా మానస వారణాసి పేరు కూడా ముందుకు రావడంతో ఆసక్తి మరింత పెరిగింది. సినిమాలోని స్పెషల్ సాంగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా, థియేటర్లలో హైలైట్ అయ్యేలా ఈ పాటను రూపొందించాలని చిత్రబృందం భావిస్తోంది. అందుకే ఈ పాటలో కనిపించే నటి ఎంపిక విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మృణాల్ ఠాగూర్ ఇప్పటికే పలు విజయవంతమైన చిత్రాలతో మంచి గుర్తింపు సంపాదించుకుని ప్రేక్షకులకు చేరువైంది. ఆమె ఈ పాటలో కనిపిస్తే సినిమాకు మరింత క్రేజ్ పెరుగుతుందని అభిమానులు భావిస్తున్నారు. ఇక మానస వారణాసి విషయానికి వస్తే, మిస్ ఇండియా టైటిల్ గెలుచుకుని సినీ రంగంలో అడుగుపెట్టిన ఆమె తక్కువ సమయంలోనే యూత్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. గ్లామర్‌తో పాటు స్క్రీన్ ప్రెజెన్స్ ఉన్న నటిగా పేరుపొందిన మానస ఈ పాటలో కనిపిస్తే కొత్త ఆకర్షణ తీసుకురావచ్చని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ ఇద్దరిలో చివరకు ఎవరు ఎంపిక అవుతారు అన్న ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటివరకు చిత్రబృందం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఈ స్పెషల్ సాంగ్ చుట్టూ సస్పెన్స్ కొనసాగుతోంది. త్వరలోనే ఈ అంశంపై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు 'పెద్ది' సినిమా విడుదల తేదీపై కూడా ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. మొదట మార్చి చివరిలో విడుదల చేయాలని భావించిన ఈ చిత్రాన్ని తర్వాత ఏప్రిల్ చివరికి వాయిదా వేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఆ తేదీపై కూడా స్పష్టత రాకపోవడంతో మరోసారి వాయిదా పడే అవకాశముందని సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. మొత్తానికి స్పెషల్ సాంగ్ ఎంపిక, విడుదల తేదీపై నెలకొన్న అనిశ్చితి కారణంగా 'పెద్ది' చిత్రం మరింత చర్చనీయాంశంగా మారింది. త్వరలోనే చిత్రబృందం అధికారిక ప్రకటన చేస్తుందా అన్నది ఇప్పుడు అభిమానుల్లో ఆసక్తిగా మారింది.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in